

కేజీబీవీల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

కరీంనగర్ టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టి-1 (తెలుగు), సీఆర్‌టి-1(బయో సైన్స్), పీఈటీ-2, పీజీసీఆర్‌టి (తెలుగు)-1, పీజీసీఆర్‌టీ (కెమిస్ట్రీ)-1, యుఆర్‌ఎస్ పా ఠశాలలో సీఆర్‌టి (మ్యాథ్స్)-1, టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసి నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావు తెలిపారు. బు ధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఎండబ్ల్యువో పవన్ కు మార్ సమక్షంలో నియామక ఉత్తర్వులను అభ్యర్థులకు అందించినట్లు తెలిపారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ నియంత్రణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ నెల 27 నుంచి డిసెంబరు 4వరకు నిర్వహించే కుటుంబ నియంత్రణ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహిం చారు. కరీంనగర్ పీపీ యూనిట్, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి, జమ్మికుంట కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంపై దంపతులకు అవగాహన కల్పించి, క్యాంపులను వినియోగించుకునేలా చూడాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు సూచించారు. అలాగే జాతీయ కుష్ఠ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేసులను గుర్తించడం కోసం డిసెంబరు 2 నుంచి 15 వరకు ప్రతి రోజు గ్రామాల్లో సర్వే నిర్వహిం చాలని ఆదేశించారు. గుర్తించిన కేసులను చికిత్స కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ యం సుధ, డీఐఓ డాక్టర్ సాజిదా అతహరి, యంసీహెచ్‌పీఓ డాక్టర్ సనా జవేరియా తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ హౌసింగ్ బోర్డు కాలనీ కట్టరాం పూర్, మోతాజ్ ఖానాలతో పాటు ఆరపల్లి, పద్మనగర్‌లో గల బస్తీ దావఖానాలను తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను, ఓపీ సేవలు, రక్త పరీక్షలు, ఫార్మసీని పరిశీలించారు. ఏఎన్ ఎంలు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలన్నారు.

గంగాధరలో నిలిచిన రిజిస్ట్రేషన్ సేవలు

గంగాధర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వర్ పనిచేయకపోవడంతో బుధవారం గంగాధరలో రిజిస్ట్రేషన్ సేవలు నిలిచాయి. గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉదయం నుంచి కార్యాలయ సమయం ముగిసే వరకు సర్వర్ పనిచేయలేదు. దీంతో వివిధ గ్రామాల నుంచి క్రయవిక్రయాలకు వచ్చిన ప్రజలు సాయంత్రం వరకు చూసి నిరాశతో తిరిగి వెళ్లారు. రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తరచూ ఇదే సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం సమస్యను పరిష్కరించాలని కోరారు.

పూర్వ వైభవానికి బీఆర్‌ఎస్ తహతహ

- 'దీక్షా దివస్'తో సెంటిమెంట్ రగిల్చే యత్నం
- 30వేల మందితో సభ ఏర్పాటుకు సన్నాహాలు
- అల్లునూరు వేదికగా జరిగే సభకు కేటీఆర్ రాక



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ మలి దశ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన నాటి నుంచి రాష్ట్ర సాధన వరకు, ప్రభుత్వ ఏర్పాటులోనూ బీఆర్‌ఎస్ పార్టీకి, దాని అధినేత కేసీఆర్‌కు వెన్నుదన్నుగా ఉంటూ వస్తున్న కరీంనగర్ జిల్లాలో ఆ పార్టీ పునర్వైభవం సాధించాలని తహతహలాడుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న 13 అసెంబ్లీ స్థానాల్లో ఒక్క స్థానాన్ని మినహా పన్నెండింటిలో విజయాన్ని సాధించి ఈ గడ్డ తన కంచుకోటగా చెప్పుకున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని విధంగా ఐదు స్థానాలకే పరిమితమైపోగా కాంగ్రెస్ ఎనిమిది స్థానాలను గెలుచుకున్నది. ఇటీవల జరిగిన పరిణామాల్లో జగిత్యాల శాసనసభ్యుడు కూడా బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్‌ఎస్ సంఖ్య నాలుగుకు పడిపోయింది. 2009 నవంబర్ 29న కేసీఆర్ సచ్చుడో...తెలంగాణ వచ్చుడో ఏదో ఒకటి తేల్చుకుంటానని ఆమరణ నిరాహారదీక్షకు కరీంనగర్ నుంచి సిద్దిపేటకు తరలివెళ్లిన సందర్భాన్ని బీఆర్‌ఎస్ పార్టీ దీక్షా దివస్‌గా పాటిస్తున్నది. ఈ నెల 29న ఆ దీక్షా దివస్‌ను గుర్తు చేస్తూ బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లాలో సెంటిమెంట్‌ను మరోసారి రగిల్చి ఈ ఉమ్మడి జిల్లాలో మళ్లీ తనపట్టును పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది. 2001 ఏప్రిల్ 27న హైదరాబాద్‌లోని జలదృశ్యంలో టీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భవించింది. ఆ తర్వాత అదే సంవత్సరం మే 17న కరీంనగర్‌లో సింహగర్జన పేరిట భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి కేసీఆర్ మలిదశ ఉద్యమానికి శంఖం పూరించారు. ఆనాటి నుంచి తెలంగాణ ఉద్యమంలో ప్రతి కీలక ఘట్టంలోనూ కరీంనగర్ కీలకపాత్ర వహిస్తూ వచ్చింది. కేసీఆర్‌ను 2004లో ఆ తర్వాత 2006, 2008 పార్లమెంట్ ఉప ఎన్నికల్లో మూడుసార్లు కరీంనగర్ ఎంపీగా గెలిపించింది. తన సెంటిమెంట్ జిల్లాగా కేసీఆర్ ముఖ్యమంత్రిగా పలు పథకాలను కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారు. అలాంటి చోట టీఆర్‌ఎస్ బీఆర్‌ఎస్‌గా మారిన తర్వాత చేదు ఫలితాలను చవిచూసింది.

కరీంనగర్‌లో ప్రతికూల పవనాలు వీస్తుండడం బీఆర్‌ఎస్ పార్టీ నేతలకు జీర్ణం కాని అంశంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 మాసాలు అవుతున్నా ఆ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని భావిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఈ పరిస్థితులను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని నిర్ణయించింది. అధికార పార్టీ వైఫల్యాలపై రాజకీయ దాడి కొనసాగించి మళ్లీ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపాలని అందుకు దీక్షా దివస్‌ను వినియోగించుకోవాలని ఆ పార్టీ వ్యూహరచన చేసింది. కేసీఆర్‌ను 2009 నవంబర్ 29న అరెస్టు చేసిన అల్లునూరు కేంద్రంగా దీక్షా దివస్‌ను నిర్వహించి భారీ బహిరంగ సభ జరుపాలని నిర్ణయించారు. 30వేల మందికి తగ్గకుండా ఈ సభకు జనం హాజరయ్యేలా

మిగతా 8వ పేజీలో...

సభా స్థలాన్ని పరిశీలించిన నాయకులు



అలుగునూర్‌లో దీక్షా దివస్ సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తిమ్మాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ సమయంలో దీక్ష నిర్వహిస్తున్న కేసీఆర్‌ను నవంబర్ 29న అలుగునూర్ వద్ద కేసీఆర్‌ను అరెస్టు చేసిన సందర్భంగా ఈ నెల 29న అలుగునూర్ వద్ద దీక్షా దీవస్ ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. బుధవారం అలుగునూర్‌లో నిర్వహించే దీక్షా దివస్ సభా స్థలాన్ని, ఏర్పాట్లను గంగుల కమలాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో, కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో బీఆర్‌ఎస్ ఆధినేత కేసీఆర్ చేసిన ఆమరణ దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి.రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సమన్వయంతో పనిచేయాలి

- సీపీ అభిషేక్ మొహంతి
- ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతపై సమన్వయ సమావేశం
- పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతపై అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. మున్సిపల్ కమిషనర్ చాహత్‌బాజ్ పాయ్‌తో కలిసి పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాలులో బుధవారం పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రత, స్మార్ట్‌సిటీ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరు, కూడళ్ల వద్ద సిగ్నల్స్ ఏర్పాటు కోసం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖతో పాటు, ఆర్‌అండ్‌బీ, హెచ్‌కెఆర్, ట్రాన్స్‌పోర్ట్‌శాఖ, ఆర్‌టీసీ, స్మార్ట్‌సిటీకి చెందిన ఎంఎస్ ఐ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి రోడ్డు భద్రతపరంగా తీసుకోవాల్సిన చర్యలు, శాఖల వారీగా అధికారులతో చర్చిం చారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి ట్రాఫిక్ సమస్యలను నియంత్రించుటకు సహకరించాలని కోరారు. కరీంనగర్‌లోని ట్రాఫిక్ నియంత్రణ కొరకు ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థను మరింత మెరుగుపరచాలన్నారు. సీసీ కెమెరా ల సంఖ్యను పెంచి వాటి పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. యూటర్న్‌ల వద్ద బ్లింకింగ్ సోలార్ లైట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు మొత్తం లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. ఫుట్ పాత్‌ల ఆక్రమణ తొలగింపు, పార్కింగ్ స్థలాలను గుర్తించి కేటాయించడం, కూరగాయల, పండ్ల మార్కెట్‌ను వేరే చోటుకు మార్చడం, యూటర్న్‌ల ఏర్పాటు, అవసరమైన చోట్ల జీబ్రా లైన్స్, స్టాప్ మార్కింగ్స్ ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్‌ను కోరారు. రోడ్డు మరమ్మతులు, యూటర్న్‌ల ఏర్పాటు, అవసరమైన చోట్ల రోడ్డు మధ్యలో గల డివైడర్‌ని తొలగించడం వంటి సమస్యలు పరిష్కరించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. స్థానిక బస్ స్టాండ్ ఇన్ గేట్ వద్ద గల కార్గో ఆఫీస్‌తో వాహనాలు అధిక సంఖ్యలో ఆగి ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్నందున ఆఫీసును బస్‌స్టాండ్ ఆవరణలో రోడ్డుకు కొంత లోపల వైపు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, బస్‌స్టాండ్‌లోని సీసీ కెమెరాల సంఖ్యను పెంచి వాటి పనితీరును పర్యవేక్షించాలని ఆర్టీసీ అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఏసీపీలు స్వామి, మాధవి, మున్సిపల్ డీఈఈ లచ్చిరెడ్డి, ఏఈఈ బి మధు, ఆర్‌టీసీ ఏటిఎం సురేష్, స్మార్ట్‌సిటీ అభివృద్ధి సంస్థ ప్రతినిధి సందీప్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాదిగల ఐక్యవేదిక నాయకులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాదిగ, మాదిగ ఉపకులాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బుధవారం నగరంలోని దుర్గమ్మగడ్డలో ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్ మీదుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు చేరుకున్నది. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్, దళిత సంఘాల నాయకులు, యువకులు, మహిళలు, డప్పు కలకారులు, ఆటపాటలు, నృత్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకరుడు రాష్ట్ర కన్వీనర్ బత్తుల చంద్రమౌళి, అజయ్, సుధాకర్, అంజయ్య, రాజ, రాజన్న, కొమురవ్వ, స్వరూప, సుంచు శ్రీను, చంద్రయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి

జమ్మికుంట, నవంబర్ 27: కరీంనగర్‌లో జిల్లా కేంద్రంలో ఈ నెల 29,30తేదీల్లో తలపెట్టిన సిపిఎం 10వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కర్తవ్యాలను నిర్ధేశించుకుంటామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరిస్తూ, కార్పొరేట్ శక్తులు, పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తుందన్నారు. పేద, శ్రమజీవుల పక్షాణ దోపిడీకి వ్యతిరేకంగా కొట్లాడింది ఎర్ర జెండానే అన్నారు. కేంద్రం దేశభక్తి పేరుతో దేశ సంపదను కార్పొరేటర్లకు అప్పనంగా దోచిపెట్టడం సిగ్గుచేటు అన్నారు. కరీంన గర్‌లోని సీతారాం ఏచూరినగర్‌లో నిర్వహించనున్న మహాసభలకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల కార్యదర్శి శీలం ఆశోక్, కమిటీ సభ్యులు జక్కుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కొత్త కొత్తగా..

- కళాభారతికి నూతన హంగులు
- త్వరలో అందుబాటులోకి రానున్న వేదిక

కరీంనగర్ కల్చరల్, ఆంధ్రజ్యోతి

6

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలి



కలెక్టరేట్ ముందు దుప్పట్లు కప్పుకొని వినూత్నరీతిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, విద్యార్థులు

సుభాష్‌నగర్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుదవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం ప్రారంభమైందని, రోజు రోజుకు చలి తీవ్రత పెరుగుతోందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలన్న శ్రద్ధ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. విద్యార్థులకు విషజ్వరాలు వస్తే నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం బాధాకరమన్నారు. సంక్షేమ హాస్టల్స్ అద్దె భవనాలు, అరకొర వసతులతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని, అయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రెండు సంవత్సరాలకు ఒకసారి బ్లాంకెట్స్ పంపిణీ చేస్తారని, అయితే ఈసారి ఇంతవరకు పంపిణీ చేయలేదన్నారు. హాస్టల్స్‌లో ప్రతివారం హెల్త్‌క్యాంపులను నిర్వహించాలని, పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు వినయ్, సాగర్, ఇషాక్, సహాయకార్యదర్శులు భోగేశ్వర్ నాగుల శ్రీజ, జిల్లా కమిటీ సభ్యులు రత్నం, సురేష్, సందేశ్, రాకేష్; గట్టు ఆకాశ్, సన్నీ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక సందడి



మార్కెట్ రోడ్ వేంకటేశ్వర ఆలయంలోదీపాలు వెలిగిస్తున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాల యంలో బుధవారం ముగ్గులు, పూలతో తీర్చిదిద్దిన వివిధ ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. అంతకు ముందు అర్చకులు దీప ప్రకాశన ప్రారంభ పూజ లు నిర్వహించారు. ఆలయంలో వివిధ ఆకృతుల్లో ఏర్పాటు చేసిన కార్తీక దీపాలు అందరికీ కనువిందు చేశాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

చెరువులో పడి పశువుల కాపరి మృతి

గొల్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తూడి రాజయ్య (50) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి బుధవారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజయ్య గ్రామంలో గేదెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 25న చేపలు పట్టేందుకు వెళ్తున్నానని చెప్పి బయటికి వెళ్లి మళ్లీ రాలేదు. కుటుంబసభ్యులు భయాందోళన చెంది అతడి కోసం గ్రామంలో గాలించారు. చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. చివరికి పక్కనే ఉన్న రంగదాముని పల్లె చెరువులో నుంచి పోతున్న ఎస్సారెస్పీ 83/ఏ ఉప కాలువలో అతడి మృతదేహం కొట్టుకువచ్చింది. గమనించిన స్థానికులు రాజయ్య మృతదేహం గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. చేపలు పట్టేందు కు తెప్పపై వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెంది ఉండవచ్చని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మురికి కాలువలో పడి వ్యక్తి..

శంకరపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఊకంటి పరబ్రహ్మం (55) అనే వ్యక్తి కేశవపట్నం గ్రామపంచాయతీ సమీపంలోని మురికికాలువలో పడి బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఇతనికి ఇల్లు, భార్య పిల్లలు లేరు. గ్రామపంచాయతీ ఆవరణలోనే ఉండేవాడు. పలువురు, బంధువులు పరబ్రహ్మం అంత్యక్రియలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

వీర్నపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లికి చెందిన ఈసంపల్లి ఆశిష్ (19) గత నెల ఒకటో తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. సుమారు రెండు నెలలు ఆస్పత్రిలోనే చికిత్స పొందాడు. బుధవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కోనరావుపేట నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలోని అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం అహ్మద్ హుస్సేన్‌పల్లికి చెందిన గజ్జల అజయ్‌కుమార్ (28) ద్విచక్రవాహనంపై మరిమడ్ల నుంచి తాటిపెల్లికి వెళ్తున్నాడు. రోడ్డుపక్కన ఉన్న ట్రాక్టర్ ట్రాలీ కల్టివేటర్ ఢీకొట్టాడు. దీంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఉపాధినిమిత్తం దుబాయ్‌లో ఉంటున్న అజయ్‌కుమార్ ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. మరో 20 రోజుల తర్వాత దుబాయ్‌కి వెళ్లాల్సి ఉంది.




- కళాభారతిలో నూతన హంగులు
- త్వరలో అందుబాటులోకి రానున్న వేదిక

కొత్త కొత్తగా..

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్రకు, కళాకారులకు, కళలకు వారధి.. సంగీత, సాంస్కృతిక సాహిత్య కళా రాజకీయ వేదికలకు పెన్నిధి... కరీంనగర్ కళాభారతి. కరీంనగర్ కళా కిరీటంలో కలికితురాయిగా నిలిచి ఎందరో మహనీయులుగా అంతర్జాతీయ వేదికలకు పరిచయం చేసిన జిల్లా కేంద్రంలోని 'కళాభారతి' కొంత కాలంగా కళ తప్పింది. అధికారులు ఇటీవల నిధులు మంజూరు చేయడంతో నూతన హంగులతో ప్రజల ముందుకు వచ్చేందుకు ముస్తాబవుతోంది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సృజనకారులు, కళాకారులు, నాయకులు, అధికారులు, ప్రజలు, సమావేశ కర్తలను వేదికగా నిలిచిన కళాభారతి కొద్ది కాలంగా నిర్లక్ష్యానికి గురవుతోంది. నేడు ఊడిన పైకప్పు పెచ్చులు... మరో వైపు విరిగిన కుర్చీలు.. ఇంకో వైపు కుంగిన వేదిక.. వెక్కిరిస్తున్న వసతులు... ఇలా శిథిలమై కనిపిస్తుంటే కళాకారుల గుండె తరుక్కుపోయేది. చెత్తా చెదారంతో అక్కరకురాని వస్తువులకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం కళాభారతి రూపురేఖలు మారుతున్నాయి. గతవైభవం సంతరించుకునేలా కళాకారులు, సాహిత్యకారులు, కళాభిమానుల కోసం అధునాతన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాభారతిని సందర్శించి రూ. 11 లక్షలతో స్టేజ్ వాల్, సౌండ్ ప్రూఫ్ ఎకౌస్టిక్, రూఫ్ షీట్స్, డ్రెస్సింగ్‌రూంలు, తెరలు, సీలింగ్, కుర్చీల మరమ్మతులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, కళాభారతికి మరోద్వారంతో పాటు మినీ పార్క్ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మేయర్ సునీల్‌రావు కూడా ఆధునీకరణ పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. పునర్నిర్మాణ పనులు ఆలస్యం అయి



నా ఆ తర్వాత పనులు వేగవంతం కావటంతో నూతన హంగులతో కళాభారతి త్వరలోనే మన ముందుకు రాబోతున్నది.

ఏదిఏమైనా కళాభారతి పునఃప్రారంభోత్సవంపై కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివిధ కళా ప్రదర్శనలకు కళాసంస్థలు, కళాకారులు సిద్ధమవుతున్నారు. ఓ అధునాతన నూతన జనరేటర్ సమ కూర్చితే బాగుంటుం దని, ఒక్కోసారి కరెంట్ పోవడంతో ప్ర దర్శనకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని కళాకారులు పేర్కొంటున్నారు.

● ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన ఘంటసాల నుంచి గద్దర్ వరకూ, కాంతారావు నుంచి నేటి నటీనటుల వరకు, ఎంఎస్ సుబ్బలక్ష్మి నుంచి నేటి కళాకారుల వరకు శ్రీశ్రీ, విశ్వనాథ, సినారె నుంచి ఈనాటి కవుల వర కు, గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అందరూ కళాభారతి వేదికనెక్కిన వారే.

ఇదీ మన కళాభారతి చరిత్ర

1974లో మున్సిపల్ ఛైర్మన్ నరహరి లక్ష్మన్ ఉన్న కాలంలో స్వతహాగా నటుడైన కళా పోషకుడు కమిషనర్ గౌస్‌మొహినోద్దీన్ కళాభారతిని ప్రారంభించారు. సుమారు 8 గుంటల స్థలంలో ఉన్న దీన్ని ఆ కాలంలో టౌన్ హాల్‌గా పిలిచేవారు. 1978లో కలెక్టర్‌గా ఉన్న కెఎస్ శర్మ దీన్ని కళాభారతిగా నామకరణం చేశారు. నాటి కాలంలో ఈ కళాభారతి కార్యక్రమాలకు సరిపడదని భావించి ప్రస్తుత కళాభారతి వెనుక భాగంలో బహిరంగ కళావేదిక ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కళాభారతి మున్సిపల్ ప్రాపర్టీ కింద పడిపోయింది.

రూ.6,950 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర 6,950 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 21మంది రైతులు 183 క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13 క్వింటాళ్ల గోనే సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,950 రూపాయలు, కనిష్ఠ ధర ఆరు వేల రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) మద్దతు ధర ప్రకారం 3,500 క్వింటాళ్ల పత్తి కొనుగోళ్లు చేపట్టింది.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు గ్రౌండ్ పరిశీలన

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల 29నుంచి జరిగే అండర్-14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలు జరిగే స్థలాన్ని క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్లు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా హాకీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ-గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 9వ తేది నుండి ఫోటోగ్రాఫీ అండ్ వీడియోగ్రఫి (పురుషులు) 30 రోజుల ఉచితశిక్షణ ప్రారంభం కానున్నట్లు సంస్థ డైరెక్టర్ డి సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంతం వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 9849411002, 7981151653 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన వ్యక్తికి ఏడాది జైలు

మల్లాపూర్, నవంబరు, 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట పంచాయతీ కార్యదర్శిని గాయపరిచిన కేసులో నిందిడుడికి సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 200 జరిమానా విధిస్తూ మెట్‌పల్లి న్యాయస్థానం బుధవారం తీర్పునిచ్చినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. 2019లో ముత్యంపేటలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఎండీ జమీల్‌ను ఖాజాఖాన్ అనే వ్యక్తి దాడిచేసి గాయపరిచాడు. విచారణ చేపట్టిన అప్పటి ఎస్సై రవీందర్ కేసు నమోదు చేశాడు. ఖాజాఖాన్‌పై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్షతో పాటు 200 రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయపట్నం గోదావరి బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సాయిని మల్లేశ్వరీ అనే వృద్ధురాలిని బుధవారం పోలీసులు కాపాడారు. మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలంలోని ద్వారక గ్రామానికి చెందిన మల్లేశ్వరీ అనే వృద్ధురాలు ఇంట్లో గొడవపడి ఆత్మహత్య చేసుకుందామని రాయపట్నం గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చింది. బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు ప్రయత్నం చేస్తుండగా అక్కడే చెక్‌పోస్టు వద్ద ఉన్న పోలీసులు గమనించారు. వెంటనే ఆమె ప్రాణాలు కాపాడి శెకెల్ల గ్రామంలో ఉన్న ఆమె కూతురు కొత్త లలితకు సమాచారం అందించారు. వృద్ధురాలికి కౌన్సెలింగ్ ఇచ్చి ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ ఆమె కూతురు లలితకు అప్పగించారు.

సీఈఐఆర్ ద్వారా 162 మొబైల్ ఫోన్ల రికవరీ

- సీసీఎస్ ఏసీపీ కాశయ్య



బాధితులకు మొబైల్‌ఫోన్లను అందజేస్తున్న సీసీఎస్ ఏసీపీ కాశయ్య

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ ఈక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ విధానం ఉపయోగించి కమిషనరేట్ వ్యాప్తంగా కొద్ది నెలల క్రితం పోగొట్టుకున్న 162 మొబైల్ ఫోన్లను గుర్తించిన సైబర్ క్రైం, సీసీఎస్ పోలీసులు బాధితులకు అప్పగించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులకు మొబైల్ ఫోన్లను అందించారు. అనంతరం విలేకరులకు సీసీఎస్ ఏసీపీ పి కాశయ్య వివరాలను వెల్లడించారు. 2023 ఏప్రిల్‌లో సీఈఐఆర్ విధానాన్ని ఉపయోగిస్తున్నామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పలు బాధితులకు 1206 మొబైల్‌ఫోన్లను గుర్తించి అందజేశా మన్నారు. సీఈఐఆర్ ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌లను గుర్తించడం సులభం అవుతుందని తెలిపారు. మొబైల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధి తులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్ లేదా సంబంధిత పోలీసు ఠాణాలో ఫిర్యాద చేయాలన్నారు. ఇదివరకే ఇతరులు ఉపయోగించిన ఫోన్లను కొనుగోలు చేసేవారు ఆ ఫోన్‌ల ఐఎంఈఐ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి చెక్ చేసుకుంటే ఆ ఫోన్ స్టేటస్ తెలుస్తుందని ఏసీపీ కాశయ్య ప్రజలకు సూచించారు. ఏ కంపెనీకి చెందిన మొబైల్ ఫోన్ అయినా సీఈఐఆర్ విధానంతో ఆ ఫోన్ ఎవరి వద్ద ఉన్నా పనిచేయకుండా చేయవచ్చన్నారు. ఈ సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ సీఐ రమేష్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న 50 సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి బాధితులకు బుధవారం ఏసీపీ శ్రీనివాస్‌జీ అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల చాలా మంది ఫోన్లు పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ సిబ్బంది ఆచూకీ కనుక్కొన్నారన్నారు. అనంతరం 50 మంది బాధితులకు సెల్‌ఫోన్లను అందించారు. తమ సెల్‌ఫోన్లు అందించినందుకు బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, పులి వెంకట్‌గౌడ్, రవి, కిశోర్, ఎస్‌ఐలు తిరుపతి, రాజకుమార్ పాల్గొన్నారు.

రామడుగు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గంటే మునిందర్, పందికుంట గ్రామానికి చెందిన బండ్ల రాంచరణ్ ఇటీవల తమ మొబైల్ ఫోన్‌లను పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ శేఖర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌లను రికవరీ చేయించి బుధవారం బాధితులకు అందజేశారు. ఫోన్‌ల రికవరీలో కీలకపాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ భూమయ్యను ఎస్‌ఐ ప్రత్యేకంగా అభినందించారు.

తప్పుడు పత్రాలతో స్థలం రిజిస్ట్రేషన్, అమ్మకం

- నిందితుడిని అరెస్టు చేసిన రూరల్ సీఐ



నిందితుడు పుట్టపాక శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చనిపోయిన మహిళ పేరిట ఉన్న స్థలాన్ని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని మరొకరికి విక్రయించిన కేసులో నిందితుడిని కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన సామిండ్ల పద్మప్రియ అనే మహిళ 2008లో మరణించింది. ఆమె పేరిట గ్రామంలో ఆరు గుంటల స్థలం ఉంది. ఆమె కుటుంబసభ్యులకు తెలియకుండా 2013లో కరీంనగర్ మారుతినగర్‌కు చెందిన పుట్టపాక శ్రీనివాస్ అనే వ్యక్తి తనపేరిట తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. వేరొక మహిళ పేరిట తప్పుడు గుర్తింపుకార్డును తయారుచేసి ఆమెను పద్మప్రియగా చూపించి అక్రమంగా స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ తరువాత ఆ స్థలాన్ని మరికొంద రికి విక్రయించాడు. స్థల యజమాని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉండటంతో వారికి ఈ విషయం తెలియలేదు. ఆలస్యంగా తెలుసుకున్న బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ నిందితుడైన పుట్టపాక శ్రీనివాస్‌ను గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు 14 రోజుల రిమాండ్‌కు కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. కాగా నిందితుడు పుట్టపాక శ్రీనివాస్‌పై కరీంనగర్‌లోని మూడు పట్టణ పోలీసు ఠాణాలతో పాటు కరీంనగర్ రూరల్ ఠాణాలో కూడా పలు చీటింగ్ కేసులు నమోదయ్యాయని సీఐ తెలిపారు.

హార్వెస్టర్‌లో మంటలు.. తప్పిన పెను ప్రమాదం

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణం వరంగల్ రోడ్‌లోని ఓ మెకానిక్ షాప్‌లో పెను ప్రమాదం తప్పింది. చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన కోమల్‌రెడ్డి హార్వెస్టర్ రిపేరు చేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ

కరీంనగర్ క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని హనుమాన్ దేవాలయంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. దేవాలయంలోని సీత, రాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి ఉత్సవ పంచలోహ విగ్రహాలను గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయారు. ఉత్సవ విగ్రహాలతో పాటు ఆలయంలోని వెండి దీపాలు, శఠగోపం, కిరీటంను కూడా దొంగలు ఎత్తుకుపోయారు. ఈ మేరకు ఆలయ పూజారి రామరాజేశ్వరశర్మ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పూజారి మంగళవారం పూజల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు గుడికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం 5:30 గంటలకు గుడికి వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఆలయం లోపలికి వెళ్ళి చూడగా నాలుగు పంచలోహ ఉత్సవ విగ్రహాలు, వెండి వస్తువులు కనపడలేదు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పంచలోహ విగ్రహాల విలువ 55 వేలుంటుందని, వెండి పూజా వస్తువుల విలువ 15వేల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఉత్సవవిగ్రహాలు ఎత్తుకుపోయింది దొంగలేనని కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ బిల్లా కోటేశ్వర్ తెలిపారు. మహాలక్ష్మినగర్‌లోని వెంకటేశ్వర దేవాలయంలో మూడురోజుల కిందట కలశాలు, సామాగ్రిని దొంగలు ఎత్తుకుపోయారని దేవాలయనిర్మాత అశోక్‌రావు తెలిపారు.



ఆలయం వద్ద విచారణ జరుపుతున్న పోలీసులు

యువకుడి మృతదేహం లభ్యం

గంభీరావుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో మంగళవారం దూకిన కామారెడ్డి జిల్లా మాచారెడ్డి ఎల్పుగొండకు చెందిన భరత్‌కుమార్ (31) మృత దేహం బుధవారం లభ్యమైంది. గంభీరావుపేట ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మృతుడు భరత్ కుమార్‌కు 11 నెలల కిందట వివాహమైంది. కొద్ది రోజులుగా భరత్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అప్పుల ఒత్తిళ్ల అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయాడు. బాధలు భరించలేకనే మంగళవారం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో దూకాడు. గజ ఈతగాళ్ల సహాయంతో భరత్ మృతదేహాన్ని మానేరు నుంచి బుధవారం బయటకు తీశారు. భరత్‌కుమార్ తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో చోరీ

- 2.5 తులాల నగలు, రూ.50 వేలు అపహరణ



బీరువాను పరిశీలిస్తున్న సీసీఎస్

జ్యోతినగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో మంగళవారం చోరీ జరిగింది. ఇంట్లో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 50 వేల రూపాయల నగదును గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. భైరి సుస్మిత అనే మహిళ తన 10 ఏళ్ల కూతురుతో అన్నపూర్ణకాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నది. మూడేళ్ల క్రితం ఆమె భర్త చనిపోగా, కూతురుతో కలిసి ఉంటోంది. సుస్మిత ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డులోని ఓ మాల్‌లో పనిచేస్తోంది. మంగళవారం తన కూతుర్ని స్కూల్‌కు పంపి మాల్‌కు వెళ్లింది. సాయంత్రం తన కుమార్తె ఇంటికి వస్తుందనే ఉద్దేశంతో ఇంటి తాళంచెవి కిటికీపై పెట్టింది. ఈక్రమంలో దొంగలు తాళంచెవితో ఇంట్లోకి ప్రవేశించి బీరువాను తెరిచి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, 50 వేల రూపాయలను అపహరించారు. బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. చోరీ జరిగిన ఇంటిని ఎన్టీపీసీ పోలీసులు, సీసీఎస్ పోలీసులు పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశుగ్రాసం దగ్ధం

మానకొండూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో పశుగ్రాసంతో వెల్తుతున్న ట్రాక్టర్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తాకి పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలంలోని ఎరడపల్లి గ్రామానికి చెందిన జింక రాజయ్య అనే వ్యక్తి బుధవారం తన ట్రాక్టర్‌లో కరీంనగర్ మండలంలోని చింతకుంట గ్రామానికి పశుగ్రాసాన్ని తరలిస్తున్నాడు. మండలంలోని గంగిపల్లి గ్రామంలోని బస్టాండ్ వద్దకు రాగానే ట్రాక్టర్‌లోని పశుగ్రాసానికి విద్యుత్ వైర్లు తాకి మంటలు లేవగా డ్రైవర్ ట్రాక్టర్‌ను నిలిపివేశాడు. గ్రామస్థుల సహాయంతో ట్రాక్టర్‌లోని గడ్డి కట్టలను కర్రల సహయంతో కిందికి తీసివేయడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక వాహనం సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.



సిరిసిల్ల శివనగర్ పాఠశాలలో విద్యార్థులకు అటల్ టింకరింగ్ శిక్షణ

బాలలు.. భావి శాస్త్రవేత్తలు

- ఆలోచింపజేస్తున్న విద్యార్థుల ఆవిష్కరణలు
- ఇన్‌స్పైర్ మనక్‌తో ప్రోత్సాహం
- అటల్ టింకరింగ్‌లో ల్యాబ్‌లో శిక్షణ



ఫోల్డింగ్ యంత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రసాంకేతిక రంగాలపై ఆసక్తి కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆవిష్కరణలతో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందిస్తూ శాస్త్ర వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సహిస్తున్నాయి. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఇన్‌స్పైర్ మానక్‌లో నూతన ఆవిష్కరణలకు జీవం పోస్తున్నారు. నాలుగేళ్ల క్రితం పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ అటల్ టింకరింగ్‌లో విద్యార్థులకు శిక్షణను అందిస్తూ నూతన ఆవిష్కరణలను తయారు చేయిస్తున్నారు. పాఠశాలలో పదోతరగతి చదువుతున్న జక్కని హేమంత్ తయారు చేసిన పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ మిషన్ 2022-23 సంవత్సరానికి ఇన్‌స్పైర్ మానక్ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపికైంది. పదోతరగతి చదువుతున్న మరో విద్యార్థి సీహెచ్ శివతేజ డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాడు. విద్యార్థిని కుమ్మరికుంట నిహారిక మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ పరికరాన్ని ఆవిష్కరించింది.

క్లాత్ ఫోల్డింగ్ యంత్రం తయారు చేశా
జక్కని హేమంత్ విద్యార్థి



పవర్‌లూం క్లాత్‌ఫోల్డింగ్ యంత్రాన్ని తయారు చేశాను. జాతీయ స్థాయికి ఎంపికైంది. మరింతగా ప్రోత్సహిస్తే మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

పరికరాలను తయారీ నేర్చుకున్నా
నిహారిక, 10వ తరగతి, సిరిసిల్ల



పాఠశాలలో అటల్ టింకరింగ్‌లో సైన్స్ పరికరాల తయారీపై శిక్షణ ఇచ్చారు. గతేడాది సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో మేకింగ్ గణేష్ ఐడియల్ విత్ ఏకో ఫ్రెండ్లీ యంత్రాన్ని తయారు చేశా. మరిన్ని పరికరాలను తయారు చేస్తాను.

సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహం
సీహెచ్ శివతేజ, 10వ తరగతి, సిరిసిల్ల



మా పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సైన్స్ పరికరాల తయారీ నేర్చుకున్నాను. నేను డాగ్ సేఫ్టీ డివైస్‌ను తయారు చేశాను.

విద్యార్థుల సృజనాత్మకతను వెలికి తీస్తున్నాం
పాకాల శంకర్‌గౌడ్, సైన్స్ టీచర్, సిరిసిల్ల



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్ సూపర్ ఫిఫ్టీ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాం. స్పోకెన్ ఇంగ్లీష్ కూడా నేర్పిస్తున్నాం. విద్యార్థుల ప్రదర్శనలు రాష్ట్ర, జాతీయస్థాయికి ఎంపికవుతున్నాయి.

రాజన్న హుండీ ఆదాయం రూ.1.50 కోట్లు



రాజన్న ఆలయంలో హుండీ లెక్కింపులో ఉద్యోగులు, సిబ్బంది

వేములవాడ కల్చరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి హుండీ ద్వారా రూ.1.50 కోట్ల ఆదాయం లభించింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో 32 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఆలయ ఖజానాకు ఒక కోటి 50 లక్షల 24 వేల 507 రూపాయలు సమకూరగా, 170 గ్రాముల బంగారం, 9 కిలోల 800 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ ఈవో వినోద్ రెడ్డి తెలిపారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖుల పూజలు



కొండగట్టులో జడ్జిని సత్కరిస్తున్న అధికారులు

మల్యాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి రవీంధర్‌శర్మ కుటుంబ సమేతంగా కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పర్యవేక్షకులు గుండి హరిహరనాథ్ శాలువతో సత్కరించగా అర్చకులు స్వామి వారికి తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

● బుల్లితెర నటుడు, యాంకర్ బత్తిరి సత్తి ఆలియాస్ రవికుమార్ కొండగట్టు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో సెల్ఫీలు దిగారు. భారతపు శ్రీనివాస్ ఆయన వెంట ఉన్నారు

ధర్మపురి (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రముఖ కమేడియన్, టీవీ యాంకర్ బిత్తిరి సత్తి బుధవారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలు

భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయి. 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరీంనగర్ పేట టీఎస్ అధ్యక్షుడు అంతడుపుల శ్రీనివాస్, పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కరీంనగర్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ జి శ్రీను, ఎండి యూనిస్ పాషా, వ్యాయామ ఉపాధ్యాయుడు ఆడెపు శ్రీనివాస్, వీరన్న, శంకరయ్య, భక్తు రాజ్‌కుమార్, మహేష్, సంతోష్, రాజబాబు, రజనీ, సౌజన్య శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కళలకు నిలయాలు ఆ పల్లెలు

- కళ్లముందు కట్టిపడేస్తున్న రంగస్థలం కళాకారులు
- సినీ, నాటక రంగంలో రాణిస్తున్న గోదూర్, వేములకుర్తి గ్రామస్థులు
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గుర్తింపు
- అటు రంగ స్థలంలోనూ... ఇటు వెండి తెరపైననూ...
- దాదాపుగా ఇంటికో కళాకారుడు... కళాభిమానులు



రంగస్థలంపై గోదూర్ కళాకారుల ప్రదర్శన

ఇబ్రహీంపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక జీవితంలో బాలీవుడ్, టాలీవుడ్, హాలీవుడ్ సినిమాలతో పాటు ప్రపంచం నలు మూలల నుంచి ఎది చూడాలనుకున్నా అరచేతిలో ఫోన్‌లో చూసేస్తున్నాం. కానీ రెండు దశాబ్దాల క్రితం స్మార్ట్ ఫోన్ రాకముందు వినోదం కావాలంటే ఖసీర్ వద్దకు వెళ్లాల్సిందే. పల్లెటూరు నుంచి పట్నం వరకు ఆనాడు వీధి నాటకాలు, రంగస్థలాలలో నాటికలు, పలు సాంస్కృతిక నృత్యాలు వేస్తే చాలు ప్రజలు గుమిగుడి ఎంజాయ్ చేశారు. అలాంటి కళలకు నిలయాలుగా ఆ పల్లెలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి.... కళాకారులకు అడ్డాగా ఆ రెండు గ్రామాలు వర్ధిల్లుతున్నాయి.

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాల్లో వర్ధిల్లుతున్న కళారంగంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

కళలకు పుట్టినిల్లుగా గోదూర్..

ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో దాదాపుగా కళాకారులు, కళాభిమానులున్నారు. దాదాపుగా వంద సంవత్సరాలుగా కళలకు పుట్టినిల్లుగా గోదూర్ గుర్తింపును సొంతం చేసుకుంది.

పలు సందర్భాల్లో పలు ప్రాంతాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి జానపద ప్రదర్శనలు, నాటిక పోటీల్లో పాల్గొని శభాష్ అనిపించుకుంటున్నారు. నాటికలకు తోడు యక్ష గానాలు, వీధి నాటికలు, హరికథలు, బుర్రకథలు, ఏకపాత్రాభినయాలు, జానపద నృత్యాలు ప్రదర్శిస్తూ ప్రశంసలు పొందుతున్నారు. గోదూర్‌లో ప్రస్తుతం దాదాపుగా సుమారు వంద మంది కళాకారు లున్నారు. గ్రామానికి చెందిన కోటగిరి మురళీ ఆలియాస్ గోదూర్ మురళీ సినీ రంగంలోనూ రాణిస్తూ మన్ననలు పొందుతున్నారు. కాయితి చంద్రశేఖర్, చల్ల దేవదాసు, కోటగిరి వెంకటస్వామి, రంగయ్య, చెట్ల శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ మూర్తి, దక్షిణ మూర్తి, తదితరులు రంగస్థల నటనలో రాష్ట్ర స్థాయిలో రాణిస్తున్నారు. గోదూర్ కళాకారులు నటించిన 'రుద్రవీణ', 'రాయి', 'చెల్లని పైసలు' నాటికలకు గతంలో రాష్ట్ర స్థాయి అవార్డులు వచ్చాయి.



చిత్రీకరణ జరుపుతున్న యూనిట్ సభ్యులు

వేములకుర్తిలో ఇంటింటికో కళాకారుడు..

మండలంలోని వేములకుర్తి గ్రామంలో దాదాపుగా ఇంటికో కళాకారుడున్నాడు. వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు వెండి తెరపైనా రాణిస్తున్నారు. గ్రామానికి చెందిన అంకతి భరత్ అను యువకుడు శ్రీ రాజన్న మూవీస్ పేరిట సొంత బ్యానర్ ఏర్పాటు చేసుకొని సినిమా నిర్మాణాలు జరుపుతున్నాడు. 'మృత్యువు', 'నేను బతికే ఉన్నాను', 'రక్షక్', 'ఇంటరాగేషన్', 'మహ కంత్రి గాళ్లు', 'వీళ్లకు అంత సీన్ లేదు', 'బాక్స్', 'మెంటల్ పోలీస్', 'పడిపోయా నీ మాయ'లో తదితర సినిమాల్లో వేములకుర్తికి చెందిన పలువురు కళాకారులు నటించారు. గ్రామానికి చెందిన రాదారపు ప్రభాకర్, మోహన్, సురేశ్, రమేశ్, కోటగిరి అశోక్, రాదారపు దేవదాసు రంగ స్థలం నటన, షార్ట్ ఫిలింస్‌లో పేరు తెచ్చుకున్నారు.



సినీ నిర్మాత దిల్‌రాజుతో వేములకుర్తి కళాకారులు

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి

అంకతి భరత్, సినీ కళాకారుడు, వేములకుర్తి



గ్రామీణ ప్రాంతాల కళాకారులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాలి. రోజురోజుకూ అంతరించి పోతున్న కళలను బతికించుకోవడానికి ప్రోత్సాహం అవసరం.

కళలకు అడ్డాలుగా గోదూర్, వేములకుర్తి

కోటగిరి చైతన్య, కళాకారుడు, గోదూర్



జిల్లాలో కళలు, కళాకారులు, కళాభిమానులకు అడ్డాలుగా ఇబ్రహీంపట్నం మండలం గోదూర్, వేములకుర్తి గ్రామాలు గుర్తింపు పొందాయి. ఉమ్మడి కరీంనగర్, ఆదిలా బాద్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్ తదితర జిల్లాల్లో పలు సందర్భాల్లో జరిగిన పోటీల్లో గోదూర్, వేములకుర్తి కళాకారులు రాణించి ప్రతిభను చాటుకున్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విశారదన్‌మహారాజ్

సుభాష్‌నగర్, నవంబరు 27: ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టనున్న మాభూమి పాదయాత్రను విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్‌మహారాజ్ కోరారు. బుధవారం నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో ఉమ్మడి జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశారదన్‌మహారాజ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం 2025 జనవరి 5న పాదయాత్ర ఆదిలాబాద్‌లో ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి, గృహం, భూమి ఇవ్వాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, తహసీల్దార్లకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. వారి నుంచి ఎలాంటి స్పందన రానందున రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు తాళ్ల నరేష్, సిరిసిల్ల బాబు, జగిత్యాల శివ, పెద్దపల్లి గణేశ్, ఉపాధ్యక్షుడు రవీందర్, బాబు, రాజేంద్ర ప్రసాద్, రాకేశ్, పరమేశ్వరి పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, పి శ్రీహర్ష, వి యుక్త జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మహ్మద్ ముష్ఫాజిల్ తెలిపారు. క్రీడాకారులను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

అరుణాచలం తరహాలో కొండగట్టు గిరిప్రదక్షిణ



గిరిప్రదిక్షణ మార్గం కోసం మట్టి తీస్తున్న ఎమ్మెల్యే సత్యం

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని అరుణాచలం వద్ద నిర్వహిస్తున్న తరహాలోనే కొండగట్టు అంజనేయస్వామి గుట్ట చుట్టూ గిరిప్రదక్షినకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కొండగట్టు గుట్ట చుట్టూ భక్తులు చేసే గిరిప్రదిక్షణ మార్గం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించి మట్టి తవ్వారు. గిరిప్రదిక్షణ మార్గంను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కొండగట్టులో గిరిప్రదిక్షన కోసం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ రెండు లక్షలు రూపాయలు సొంతంగా ఇచ్చారని అందులో భాగంగా పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈవో అంజయ్య, మల్యాల, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్లు రాంలింగారెడ్డి, రాజనర్సింగరావు, నాయకులు ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీశ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, అనిల్, వినయ్, హరినాథ్, తిరుపతి నర్సింహరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రతాప్, మల్లేశంపాల్గొన్నారు

ధర్మపురిలో కార్తీక భక్తుల సందడి

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో బుధవారం కార్తీక భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ రామలింగేశ్వ స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహుడి ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామివారల నిత్య కళ్యాణం జరిపించారు. స్వామివారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు చేశారు. స్థానిక శేషప్ప కళావేదికపై బ్రహ్మశ్రీ గరిపెల్లి మహేష్‌శర్మ కార్తీక పురాణ ప్రవచనాలు చేశారు.



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 26వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెం డెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, పాల్గొన్నారు.

పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై దృష్టిసారించండి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టుల విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్సులో పెండింగ్ ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోళ్ళపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రాజెక్టుల భూసేకరణ విషయమే ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తమను సంప్రదించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక అధికారులను నియమించామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని చిన్న కాళేశ్వరం, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోగా పూర్తి చేస్తామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని ప్యాకేజీ -9, 10, 11, 12 మిగతా పనిపూర్తి చేసేందుకు కావలసిన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు. ధాన్యం సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని, డేటా ఎంట్రీ వేగంగా పూర్తి చేసి రైతుల బ్యాంక్ ఖాతాల్లో రెండురోజుల్లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర అవసరాల మేరకు సన్నరకం ధాన్యం సేకరణ పకడ్బందీగా చేయాలని రైతుల ఖాతాల్లో రూపాయలు 500 బోనస్ పేడలా ఏర్పాటు చేయాలని సూచించారు. సంక్షేమ హాస్టల్‌లకు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చౌక ధరల దుకాణాలకు సన్న రకం బియ్యం అందిస్తామని చెప్పడం జరిగిందని అన్నారు. సన్నవడ్ల ఎక్కువ మొత్తం లో కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున కొనుగోళ్ళపై దృష్టిపెట్టాలని అన్నారు.

● **84శాతం చెల్లింపులు పూర్తి**

కరీంనగర్ జిల్లాలో ఇప్పటి వరకు 53,512 మెట్రిక్ టన్నుల సన్న రకాలు, 1,23,208 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం కొనుగోలు చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మొత్తం 1,76,720 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు సుమారు 345 కోట్ల రూపాయలను చెల్లించినట్లు చెప్పారు. త్వరలోనే మిగతావి చెల్లిస్తామని అన్నారు. సన్న రకాల రైతులకు 11.18 కోట్ల రూపాయల బోనస్ చెల్లించామని తెలిపారు. మూడు రోజుల నుంచి కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ మొత్తంలో సన్నవడ్లు వస్తున్నాయని, నూరుశాతం కొనుగోలు పూర్తిచేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్సులో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ దేవంద్రసింగ్ చౌహాన్, జిల్లా పౌరసరఫరా అధికారి నర్సింగారావు, జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా వ్యవసాయాధికారి విజయభాగ్యలక్ష్మి, డీఆర్‌డీవో శ్రీధర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహ నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని మహిళా శిశుసంక్షేమ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలోని పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, యూనిసెఫ్ సహకారంతో బాల్య వివాహ నిర్మూలనకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ కళాశాలల హాస్టల్‌లో డీసీపీవో పర్వీన్ పాల్గొని బాల్యవివాహ నిరోధక చట్టం, బాల్య వివాహాల ద్వారా వచ్చే అనర్థాలను వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, ఆ వివాహం కూడా చెల్లదని అన్నారు. బాల్య వివాహం గురించి సమాచారం ఉంటే చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098 గానీ, 94908811098 నంబర్‌కు కానీ ఫోన్‌చేసి తెలపాలని అన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి రమేశ్, కల్యాణి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరి మహా హారతి విజయవంతం చేయాలి

ధర్మపురి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నవంబరు 30 న శనివారం సాయంత్రం జరిగే గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గోదావరి హారతి ఉత్సవ సమితా రాష్ట్ర కో కన్వీనర్ దామెర రాంసుధాకర్‌రావు కోరారు. స్థానిక గోదావరి నది మంగళిగడ్డ స్నానఘట్టం వద్ద బుధవారం మహా హారతి కోసం స్థలాన్ని చూసి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాంసుధాకర్‌రావు మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరొందిన ధర్మపురి క్షేత్రంలో గత 13 ఏళ్లుగా గోదావరి మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ గోదావరి మహా హారతి కార్యక్రమానికి విశ్వహిందూ మహా సంఘ్ భారత్, శ్రీలంక అద్వైత పీఠాధిపతి, పూజ్యశ్రీ అతిథేశ్వరానంద పర్వత, గోదావరి హారతి ఉత్సవ సమితి వ్యవస్థాపక చైర్మన్, బీజేపీ జాతీయ నాయకులు పోల్సానీ మురళీధర్‌రావు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. వైదిక స్మార్త జ్యోతిష్య పౌరాణికులు, బ్రహ్మశ్రీ పాలెపు భరత్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో కన్వీనర్ బల్గూరి సంతోష్‌రావు తదితరులు హాజరవుతారని ఆయన వివరించారు. కావున అధికసంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో గోదావరి హారతి ఉత్సవ సమితి జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, సభ్యులు సురేందర్‌రెడ్డి, కందాల నర్సింహమూర్తి, బండారి లక్ష్మణ్, లక్ష్మీనర్సయ్యగౌడ్, గోపి, సతీష్, వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు కస్తూరి రాజన్న, సంగి నర్సయ్య, బెజ్జారపు లవణ్, బండారి లక్ష్మణ్, దొనకొండ నరేష్, నలుమాసు వైకుంఠం, గాజు భాస్కర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, అప్పం మల్లేష్, దివిటి శ్రీధర్, పల్లెర్ల సురేందర్, కాశెట్టి హరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమాలకు మోక్షమెప్పుడో..?

- నత్తనడకన వృద్ధుల, అనాథ ఆశ్రమ భవనాల నిర్మాణ పనులు
- కలెక్టర్ ఆదేశాలు సైతం బేఖాతరు



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకం

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనాథలు, వృద్ధులకు ఆశ్రయం కల్పించేందుకు మంజూరైన ఆశ్రమాలకు మోక్షం కలగడం లేదు. రెండేళ్లు కావస్తున్నా నిర్మాణ పనులు పూర్తి కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టడానికి ఆనాటి మంత్రి, ఎమ్మెల్యే తదితరులు శంకుస్థాపనలు చేశారు. ఒక భవనం పనులు ప్రారంభమైనా అసంపూర్తిగానే మిగిలిపోయింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పనుల్లో వేగం పెంచినా ఇంకా పనులు పూర్తి దశకు చేరుకోలేదు. అనాథాశ్రమం భవన సముదాయం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంటీరియర్‌తో పాటు ప్రహరీ గోడల నిర్మాణాలు, సెప్టిక్ ట్యాంక్ వంటి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సత్వరం పనులు చేపట్టేందుకు కలెక్టర్లు సైతం ఇక్కడి పనులను పరిశీలించారు. 24 జనవరి 2023న శంకు స్థాపనలు జరిగిన ఈ భవన నిర్మాణాలు 15 మార్చి 2024లోగా పనులు పూర్తి కావాలని కలెక్టర్ పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కానీ అవి కార్యరూపం దాల్చడంలేదు. దాదాపు రూ.70 లక్షల వ్యయంతో సుల్తానాబాద్ పట్టణంలోని మార్కండయ్య కాలనీ సమీపంలో పెరికిగిద్దె ఆంజనేయ స్వామి ఆలయం పక్కన వీటి నిర్మాణం చేపట్టారు. జిల్లాలోని మూడు పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజక వర్గాల పరిధిలోని వృద్ధులకు ఆశ్రయం కల్పించే వీలుగా వారికి అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని అనాథ ఆశ్రమం

ఒకే ప్రాంగణంలో వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్

మార్కండేయ్య కాలనీలో చేపట్టిన నిర్మాణ ప్రాంతంలో ఒకే చోట పలు సంక్షేమ భవనాలతో పాటు వృద్ధాశ్రమం, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ వంటివి ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయిం చారు. ఆ ప్రకారంగా నిర్మాణాలు చేపట్టినా అవి నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు రుతుక్రమ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆటమ్ హాస్పిటల్ డాక్టర్ శ్రీజ బద్దం సూచించారు. కరీంనగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలో విమెన్ ఎంపవర్మెంట్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీజ బద్దం మాట్లాడుతూ విద్యార్థినులకు రుతుక్రమంలో వచ్చే సమస్యలు, పరిష్కారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ బి రజినీ దేవి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వరలక్ష్మి, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎం కల్పన పాల్గొన్నారు.

అన్నదానం

సుభాష్‌నగర్, నవంబరు 27:(ఆంధ్రజ్యోతి): ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ 55వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం జిల్లా ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్ మేనేజర్ దుబ్బాక రాజిరెడ్డి, కరీంనగర్ ఇంచార్జి తంగల శ్రీనివాస్, రమేశ్, నరేస్, అజయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు భిక్ష

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ జెడ్‌పి క్వార్టర్స్‌లోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ సాగర్‌రావు-విజయలక్ష్మి దంపతులు దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. అంతకు ముందు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కొన్న కాంతారెడ్డి, పలువురు గురుస్వాములు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘనపై చర్య తీసుకోవాలి

భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి సిద్దిపేట ప్రభుత్వ పాఠశాల పనివేళలో ప్రచారం నిర్వహించిన వంగ మహేందర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు నరహరి లక్ష్మారెడ్డి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

సీపీఐ నేత ప్రసాద్ మృతి తీరనిలోటు

భగత్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అకాలమృతి ప్రజా ఉద్యమకారులకు తీరనిలోటని కరీంనగర్ జిల్లా సీపీఐ కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. ఖమ్మంలో బుధవారం ఉదయం వాకింగ్‌చేస్తు పోటు ప్రసాద్ గుండెపోటుతో మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన మృతి పట్ల కరీంనగర్ జిల్లా సమితి పక్షాన తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తు వారి కుటుంబానికి సానుభూతి తెలుపుతున్నామన్నారు.

గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు సర్కారు అండ

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు సర్కారు అండగా ఉంటుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన సుందరగిరి రమేశ్ అనే గల్ఫ్ కార్మికుడు గుండెపోటుతో అబుదాబిలో మరణించాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం, ఎలాంటి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఐదు లక్షల రూపాయల పరిహారం మంజూరు చేయించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్‌ను ఆయన రమేశ్ కుటుంబ సభ్యులకు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లి, వివిధ కారణాలతో అక్కడే మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఎన్‌ఆర్‌ఐ పాలసీని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో పరుమల్ల మనోహర్, దొమకొండ మహేశ్, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, మ్యాక వినోద్, సురేస్; కార్తిక్, తిరుపతి పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేకు వినతి..

రామడుగు (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశరాజుపల్లి గ్రామస్థులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. దేశరాజుపల్లి గ్రామంలోని ఔదారపల్లి నీళ్ల ట్యాంక్ నుంచి వెంకటగిరి వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మించాల్సి ఉండగా పనులు చేపట్టడం లేదన్నారు. ఫలితంగా ఈదారి గుండా వెళ్తున్న విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లే సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రోడ్డు పనులు పూర్తయ్యేలా చూడాలని వినతిపత్రంలో కోరారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

కరీంనగర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని ఎంఈవో రవీందర్‌రావు ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం కరీంనగర్ మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బడికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూడైస్ ప్లస్‌లో గ్యాప్ లేకుండా చూడాలన్నారు. పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనం నాణ్యతతో పరిశుభ్రతతో ఉండేలా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో సౌకర్యాల విషయంలో సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, యంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ భాషలన్నింటికీ సంస్కృతం మూలం

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారతీయ భాషలన్నింటికీ సంస్కృతం మూలమని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గంధ్ర లక్ష్మణరావు అన్నారు. తెలుగు భాషా విభాగం ఆధ్వర్యంలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత అధ్యయన కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరలక్ష్మి అధ్యక్షతన బుధ వారం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భారతదేశంలో సంస్కృత భాషకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. రామాయణ, మహాభారత, ఇతిహాసాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి మాట్లాడుతూ సంస్కృతాన్ని కేవలం మార్కుల కోసం కాకుండా వైజ్ఞానిక గ్రంథాల అధ్యయనం చేయడానికి నేర్చుకోవాలన్నారు. ప్రస్తుతం నూతన విద్యా విధానంలో సంస్కృతానికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు, సంస్కృత భాషాభిమానులు కళాశాల లోని సంస్కృత అధ్యయన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా అధ్యక్షులు డాక్టర్ ఎం లక్ష్మణరావ, కేంద్ర శిక్షిక లెక్కల రమ, తెలుగు ఉపన్యాసకులు తిరుపతి, పరిమళ, శ్రీలత, స్వరాజ్యం లతో పాటు ఉపన్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గణేశ్‌నగర్‌లో సామాజిక సమరసతా వేదిక బుధవారం లోకమాత అహల్యాబాయి హోల్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేదిక కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో 15 మందికి పైగా మహిళలు ప్రధానపాత్ర పోషించారని అన్నారు. చిత్తు ప్రతిని తయారు చేయడంలో బిఎన్ నరసింగరావు, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సర్దార్ వల్లభాయ్‌పటేల్‌తో పాటు డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన ప్రయత్నం వల్ల అందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగం లభించిందని అన్నారు. కుల, మత, లింగ భాష ప్రాంత బేధం లేకుండా సమాన హక్కులు ప్రసాదించందని పేర్కొన్నారు. అహల్యాబాయి హోల్కర్ 1750లో మహిళా సైన్యం నిర్మించిందని, ఆయుధాల కర్మాగారం ప్రారంభించిందని అన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన మహేశ్వరం చీరలను చేనేత కార్మికుల ద్వారా తయారు చేయించిందని అన్నారు. సుమారు 150 దేవాలయాలను పునరుద్ధరించారని అన్నారు. వితంతువులకు ఉపాధి సౌకర్యం కల్పించిందని అన్నారు. ఆ రోజుల్లోనే మహిళా సాధికారత కోసం కృషి చేసిన ధీర వనిత అయిన ఆమెను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం, కర్తవ్యం మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రామారావు, జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, వినోద, సంధ్య, దావు సంతోష్, నర్సింగ్, పురుషోత్తం, జగన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాన్సన్ కోరా విద్యార్థుల క్షేత్ర పర్యటన

కరీంనగర్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాన్సన్ కోరా పాఠశాల విద్యార్థులు ఎడ్యుకేషనల్ టూర్లో బాగంగా బుదవారం కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్లోని పాల కేంద్రాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు పాల ఉత్పత్తి విదానాన్ని వాటిని శుభ్రపరిచి వేడి చేసి స్టోర్ చేసే విదానాన్ని అక్కడి సిబ్బంది విద్యార్థులకి సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ వంగల సంతోష్ రెడ్డి పాల్గొని విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి ఎడ్యుకేషన్ పర్యటన ఎంతో ఉపయోగపడతాయని చదువుపట్ల జిజ్ఞాసను కలిగిస్తుందని పిల్లల్లో ఆలోచనా శక్తిని పరికల్పనలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాలకు శిలాజం అందజేత

గణేశ్‌నగర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల నాటి శిలీభవన శిలాజాన్ని శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్ కళాశాలకు జిల్లా ఆర్కియాలజీ గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామాచారి బుధవారం అందజేశారు. ఇంచార్జ్ ప్రిన్సిపల్ నితిన్ ఆధ్వర్యంలో వృక్ష శాస్త్ర విభాగం ,చరిత్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలకు అందించారు. ఈ శిలాజం మంచిర్యాల జిల్లా వేమనపల్లి గ్రామం, మండలానికి చెందిన గోదావరి, ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో లభ్యమయిందని డాక్టర్ రామాచారి తెలిపారు. ఈ శిలాజం ప్రస్తుతం డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వృక్షశాస్త్ర విభాగంలో ప్రత్యక్ష అనుభవాలు పొందడానికి ఎంతగానో ఉపకరిస్తుందని వృక్ష శాస్త్ర విభాగాధిపతి కళాశాల పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ పేర్కొన్నారు.

పూర్వ వైభవానికి బీఆర్ఎస్ తహతహ

(5వ పేజీ తరువాయి)

చూడాలని పార్టీ సన్నాహాలు చేస్తోంది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ సమావేశానికి హాజరై ప్రసంగించనున్నారని సమాచారం. ఈ నెల 29 నుంచి డిసెంబర్ 9వరకు దీక్షా దివస్ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. 11రోజులపాటు జరిగే దీక్షా దివస్ కార్యక్రమాలను సెంటిమెంట్ రగిల్చే విధంగా నిర్వహించాలని, ప్రభుత్వ వైఫల్యాలను అమలుకు నోచుకోని పథకాలను ప్రజలకు వివరించి తిరిగి ప్రజల్లో రాజకీయంగా బీఆర్ఎస్ సానుకూలవైఖరి పెంపొందించుకోవాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో బీఆర్ఎస్ సానుకూల వైఖరిని పెంచుకోవడం ఎంతైనా అవసరమని వారు భావిస్తున్నారు. స్థానిక సంస్థల్లో పట్టుసాధించడం ద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా ఎదుగాలని ఆ పార్టీ నేతలు కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.

అండర్-19 వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ట్రినిటి విద్యార్థి


విద్యార్థి షేక్ అఫాన్‌ను ప్రశంసాపత్రం అందజేస్తున్న ట్రినిటి చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 కేజీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీ లకు జిల్లా కేంద్రంలోని ట్రినిటి జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ ఆఫాన్ ఎంపికయ్యాడు. ఈనెల 22న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన షేక్ ఆఫాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ట్రినిటి కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షేక్ ఆఫాన్‌కు ట్రినిటి చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందించారు. ట్రినిటి సంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

మెడికవర్ ఆసుపత్రిలో క్రిటికల్ డెలివరీ



మాట్లాడుతున్న డాక్టర్ ప్రతిష్ఠారావు

సుభాష్‌నగర్, నవంబరు 27: జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో క్రిటికల్ డెలివరీ చేసినట్లు ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిష్ఠారావు తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలియచేశారు. నగరానికి చెందిన మమత అనే గర్భిణిని ప్రసవం కోసం కుటుంబ సభ్యులు మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించారు. డాక్టర్ ఆమెను పరీక్షించి గర్భంలో మావి గర్భసంచి కింది భాగంలోకి వచ్చి చేరినట్లు గుర్తించారు. ప్రసవం చేయడం అత్యంత క్రిటికల్ కావడంతో పరిస్థితి కుటుంబ సభ్యులకు వివరించారు. రిస్క్‌ను ఎదుర్కోవడానికి తాము సిద్ధమేనని వారు తెలపడంతో వెంటనే ఆమెకు ఆపరేషన్ చేశామన్నారు. 3 కిలోల బరువున్న ఆడశిశువు జన్మించిందని, గర్భసంచిని కూడా తొలగించకుండా కాపాడామని తెలిపారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో అనస్తీషియా వైద్యుడు డాక్టర్ వినయ్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక గేటు ధ్వంసం

కరీంనగర్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం గోపాల్‌పూర్ గ్రామంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శ్మశాన వాటిక గేటు తాళం పగులగొట్టి ఫెన్సింగ్ పోల్స్‌ను ధ్వంసం చేశారు. దీనిపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పాదయాత్ర


ఉద్యమకారుల పాదయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, 250 గజాల స్థలం, 25 వేల పెన్షన్ ఇవ్వాలని కోరుతూ బుధవారం కరీంనగర్ అమరవీరుల స్థూపం నుంచి వేములవాడ దేవస్థానం వరకు పాదయాత్ర చేపట్టారు.

ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులు స్వాగతం పలుకుతూ 33 జిల్లాలో ఉద్యమకారులు చేపట్టిన పాదయాత్రను ప్రారంభిస్తున్నామని కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ పాదయాత్రలో రాష్ట్ర ఫోరం చైర్మన్ చీమ శ్రీనివాస్, చీఫ్ అడ్వైజర్ ఓరుగంటి ఆనంద్, ఫోరం జిల్లా చైర్మన్ కుమారస్వామి, నాయకులు సంజీవరెడ్డి, ఎల్లారెడ్డి, గాలి రమేష్‌యాదవ్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా జవ్వాజి హరీష్

రామడుగు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వన్నారం గ్రామానికి చెందిన జవ్వాజి హరీష్‌ని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. తన నియమాకానికి సహకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ఎమ్మెల్యే సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

హుజూరాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాస్, టి శ్రీనివాస్, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తిరుపతిరెడ్డి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుపతిరెడ్డి

చిగురుమామిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, సుందరగిరి గ్రామానికి చెందిన కంది తిరుపతిరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అయనతో పాటు డైరెక్టర్లు బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్టుమల్ల రవీందర్, నాయకులు వెంకటరెడ్డి, మల్లారెడ్డి, కానవేని శివకుమార్, ఎలగందుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలు జరిగేలా బోధన చేపట్టాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కొత్త ఆవిష్కరణలు జరిపించేలా అధ్యాపకులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ విద్యాబోధన చేయాలని ఏఐసీటీఈ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యూకేషన్ సెంటర్ మేనేజర్ బీమా లింగేశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ కందుకూరి శంకర్ అధ్యక్షతన మేనేజర్ ఐడీ అండ్ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ అనే అంశంపై సెమినార్ జరిగింది. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు ఉన్నారు.

పీహెచ్‌సీకి ప్రహరీ లేక ఇబ్బందులు

ఇల్లందకుంట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ నిర్మాణం లేకపోవడం వల్ల ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్రభుత్వాస్పత్రికి వందలాది మంది వైద్యం చేయించుకోవడానికి స్థానికంగా ఉండే ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు తీసుకుంటారు. కానీ వానాకాలంలో చెరువులోని నీరు ఆస్పత్రిలో మెట్ల వరకు చేరుకుంటాయి. చెట్లు ఏపుగా పెరిగి చిత్తడిగా మారింది. అప్పుడప్పుడు పాములు, తేళ్లు కూడా ఆస్పత్రిలోకి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సర్కార్ ఆస్పత్రికి నిధులు కేటాయించి ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్

గన్నేరువరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ తర్వాతే ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ విభాగాల మండల ఇన్‌చార్జి కనకం అంజిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడుతామని సీఎం హామీ ఇచ్చారన్నారు. కానీ ఎస్సీ వర్గీకరణ లేకుండానే ఉద్యోగాలను భర్తీ చేస్తున్నారని మండిపడ్డారు. కమిటీలు, కమీషన్‌ల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని అన్నారు. డిసెంబరు 8న ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కవ్వంపల్లి మునీందర్, కవ్వంపల్లి రాజయ్య, మాతంగి అనిల్, వెదిర రాజయ్య పాల్గొన్నారు.

● **రామడుగు:** రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం అమలు చేయాలని ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సందే కార్తీక్ మాదిగ అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపూర్‌లో మాదిగ విద్యార్థులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తుందో జవాబు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు దీపక్ మాదిగ, అజయ్ మాదిగ, సంతోస్ మాదిగ, నరేష్ మాదిగ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామడుగు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపల్లి ఫీడర్‌లో మరమ్మతులు ఉన్నందున గుండి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కొమ్ము కమలేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండి, గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్, వెంకట్రావ్‌పల్లి, చిప్పకుర్తి, రాంచంద్రాపూర్, రామడుగు, శ్రీరాములపల్లి గ్రామాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘం లక్ష్యం

చిగురుమామిడి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల సంక్షేమమే లక్ష్యంగా సింగిల్‌విండో సొసైటీ నిరంతరం పరిపాలన నిర్వమిస్తుందని సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని గునుకుల పల్లి గ్రామపంచాయతీ పరిధిలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ పంపును బుధవారం అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలపాటు పెట్రోల్ బంక్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శరణ్, వైస్‌చైర్మన్ కరివేద మహేందర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు, సింగిల్ విండో సీఈవో కాటం నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేద్దాం

గంగాధర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబేలా దీక్షా దివస్‌కు కదిలి విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. బుధవారం బూరుగుపల్లి బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న అలుగునూరులో నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఆరు మండలాల బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్

శంకరపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం శంకరపట్నం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్ అధ్యక్షతన విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావానికి లోనై మాదకద్రవ్యాల బారిన పడుతున్నారన్నారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రభావం పడుతోందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను గమనించాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభను విజయవంతం చేయండి


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

తిమ్మాపూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29,30 తేదిలలో జరిగే సిపిఎం పార్టీ 10వ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకరి సంపత్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో ప్రజాసంఘాల మండల సమన్వయ కమిటీ కన్వీనర్ మాతంగి శంకర్ అధ్యక్షత ప్రజాసంఘాల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంపత్ మాట్లాడుతూ నిత్యం కార్మిక, కర్షకుల సమస్యల సాధన కోసం పోరాడుతున్న సీపీఎం మహాసభకు వేలాదిగా కార్మిక కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 29న కరీంనగర్‌లోని ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ముకుందలాలు మిశ్రా భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు, అనంతరం రెండు రోజుల పాటు పార్టీ జిల్లా మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజాసంఘాల మండల సమస్వయ కమిటీ కన్వీనర్‌గా మాతంగి శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల సమస్వయ కమిటీ కన్వీనర్ మాతంగి శంకర్, నాయకులు అడిచర్ల వెంకటేష్, ఇజ్జగిరి తిరుపతి, పైడిపల్లి సంపత్, పైడిపల్లి నరసయ్య, దుండి హనుమంతు, మీస సంపత్, వి.కుమార్, రాజు, అంజయ్య, నాగరాజు, స్వామి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

వీణవంక: మండలంలోని దేశాయిపల్ల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్ల కొండాల్‌రెడ్డి తండ్రి పుల్లారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ పరామర్శించారు.

- వీణవంక మండలంలోని బేతిగల్ లో నల్ల చెరువుకు ఆనుకొని ఉన్న వ్యవసాయ క్షేత్రాల రైతులు చెరువును ఆక్రమించుకొని దుక్కులు దున్నుతున్నట్లు స్థానికులు రెవెన్యూ అధికారులకు బుధవారం సమాచారం ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, ఆర్ఐ రవిని ఘటనా స్థలానికి పంపించి పనులను నిలిపి వేయించారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన టీడీపీ మండలాధ్యక్షుడు సదయ్య ఆరీఫ్ (60) గుండెపోటుతో మృతి చెందాడు.

- శంకరపట్నం మండల పరిధిలోని 24 గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి, కులగణన సర్వే పూర్తయినట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ ప్రకటనలో తెలిపారు.

- కేజీబీవీ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం యూటీఎఫ్ నాయ కులు శంకరపట్నం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో భోజన విరామ సమయంలో సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు, యూటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు.

రామడుగు: మండలంలోని గుండి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొన్నం శ్రీనివాస్‌గౌడ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెం ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత, పోషక ఆహారంపై హైద్రాబాద్‌లోని మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు అవగాహన కల్పించారు.

- జమ్మికుంట పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌లు పట్టుకున్నారు. రమేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని ధర్మరాజుపల్లిలో జయన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది.

చొప్పదండి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని కాట్నపల్లి గ్రామంలో ఉచిత డయాబెటిస్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

- చొప్పదండిలోని ఎంఆర్సీలో మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో దీక్షితులు శ్రీనివాస్ పాల్గొన్నారు.